


# ఆనాటి అపురూప చిత్రాలు

## ఈనాటి సమగ్ర పరిచయాలు

- ప్రొ.డా.జ్ఞానేశ్వర రావు కె.వి.ఎస్



*సినిమా రంగంలో విజయావారి బేనర్‌కి ఒక ప్రత్యేకతవుంది. వారు పక్కా సినిమా స్క్రిప్ట్ తయారుచేసుకునిగాని చిత్రీకరణ మొదలుపెట్టే ప్రశ్నే లేకుండా ప్రతి  సంవత్సరం సంక్రాంతి కానుకగా సినిమాలు రిలీజు చేసేవారు. భవిష్యత్తులో ఎదురులేని హీరో, హీరొయిన్లుగా ఎదిగినప్రముఖులు, లబ్ధప్రతిష్ఠులు తొలిరోజుల్లో నెలవారీ జీతాలతో 'ఇగో ప్రాబలమ్స్' తలెత్తకుండా దర్శక, నిర్మాతలకి లోబడి క్రమశిక్షణతో ఒకే త్రాటిపై నడిచి పనిచేసేవారు. సాంకేతికబృందం సరేసరి–అంతా కలిసి ఒకే కుటుంబంలా మసలుకునేవారు. అది సినిమాల స్వర్ణ యుగం. అందువల్ల సినిమాచూస్తున్నంతసేపూ వినోదంతోపాటు ప్రేక్షకులు ఆయా పాత్రలతో తాదాత్మ్యంచెంది సన్నివేశపరంగా ఆయా అనుభూతులను నవరసభరితంగా పంచుకోవడం జరిగేది. పాటలుగాని, నృత్యాలుగాని అశ్లీలం చోటుచేసుకోకుండా సందర్భానుసారంగా, సాంప్రదాయరీతిలో పాలల్లో నీళ్ళలాగా కలిసిపోయి ఆహ్లాదాన్ని కలిగించేవి.*

*హాస్యం పాత్రోచితంగా కథాస్రవంతిలో కలిసిపారేది. వాస్తవికత,నాటకీయత, కాల్పనికత,సృజనాత్మకత సమపాళ్ళలో రంగరించినట్లుగా పడుగుపేకగా సాగేవి. ఒక దృశ్యకావ్యాన్ని ఆవిష్కరించడంలో నటీనటులు పోటీపడి నటించడమేగాక డైరెక్టర్ నుండి లైట్‌బోయ్   వరకు కథాచర్చల్లో పాల్గొని శ్రద్ధాసక్తులు చూపేవారు. 'జనం కోరేది మనం చేయాలి' అనే సంకల్పంతో జనరంజకంగా వినోదాన్ని అందించేవారు. 'షావుకారు' మొదలుకొని 'బృందావనం' వరకు  ఎన్నో సినిమాలు తదుపరి చిత్రాలకు ఒరవడిగా , గీటురాళ్ళగా వెలిశాయి.(బ్లాక్ బస్టర్ క్లాసిక్స్‌తో  పాటు కొన్ని ఫ్లాప్స్ కూడా జతగూడటం అనూహ్యం!)*

*అంతేకాక 'విజయా పతాక' సినిమాల్లోఎవరినీ నొప్పించకుండా సమకాలీన సాంఘిక సామాజిక సమస్యల ప్రస్తావన ఉండేది. పాటలు సందేశాత్మకంగా ఉండేవి. సంభాషణలు నిజజీవితానికి దర్పణం పట్టేవిగా మలచబడేవి. ఏ పాత్ర నిర్మాణంలోనూ అనౌచిత్యం కనిపించకపోగా, ఆ పాత్రలేనట్లు ఊహిస్తే లోటుగా,వెలితిగా, అసహజంగా అనిపించేది. ఆ 'జిగిబిగి' అంత పకడ్బందీగా ఉండేది. సంభాషణాచాతుర్యానికీ, చమత్కారాలకీ , సామెతలకీ, జాతీయాలకీ, లోకోక్తులకీ, నానుడులకీ కొదవలేదు. మాటలు,పాటలు సానబట్టిన చురకత్తుల్లా పదునుగా, మణిమాణిక్యాల్లా తళుక్కుమంటూ, కొత్త ఆవకాయఘాటులా చురుక్కుమంటూ, తేటతెనుగు తేనెలూరుతూ, భాషనేర్చేవాళ్ళకు  పాఠ్యగ్రంథాల్లా ఉండేవి. మచ్చుకి ఒక్క పొల్లుమాటకూడా కానరాకుండా ప్రసిద్ధరచయితలు శ్రద్ధ తీసుకునే వాళ్ళు. పాటలు రసగుళికలే! గాత్రశుద్ధిగల గాయనీ గాయకుల  గళాలనుండి జాలువారి అజరామరంగా ఆబాలగోపాలపు నాలుకలపై నర్తించేవి. కళ, ఫొటోగ్రఫీ, సినిమటోగ్రాఫీ బ్లాక్ అండ్ వైట్ రోజుల్లో కూడా అత్యున్నత ప్రమాణాల్లో అబ్బురపాటుగొలిపేవి. సాధారణ ప్రేక్షకుడిని కూడా సహజత్వంతో మొదలుపెట్టి, ఊహాలోకాల్లోకి తీసుకుపోయేవి.అంతర్లీనంగా సమాజానికి మేలుచేసే ఏదో ఒక సందేశం లేకుండా ఏ సినిమా ఉండేదికాదు.*

# మాయాబజార్

## (గత సంచిక తరువాయి)

**విద్యా ప్రాంగణంలో** రాక్షస భటుల విద్యా పరీక్ష.

ఘటోత్కచుడు: ఆఁ. కానీండి.

చిన్నమ(న్మ)య: ఊఁ. దుంబూ. పాండవులు అస్మదీయులు.అంటే మనవాళ్ళు. చెప్పు.

దుంబు: ప–అ–ఆండవులు అసమదీయులు.

చిన్న: అసమకాదు–అస్మ అస్మ అనాలి.

దుంబు: అసమకాదు–అస్మ అస్మ అనాలి.

చిన్న: వీడు నాకే విద్య నేర్పుతున్నాడు నాయకా. అస్మ అనమనండి.

దుంబు: ఆ మాటతో మనవాళ్ళను తలుచుకుంటాం నాయకా.

ఘటో: చిన్నమయా. పాండిత్యం కంటె జ్ఞానమే ముఖ్యం. వేసుకో వీరతాడు(దుష్టసమాసం– వీర –సంస్కృతం ;తాడు తెలుగు. హాస్యం) ఒక మోకులాంటి చెట్టుకొమ్మ గుండ్రంగా చుట్టి మెడలో దండగా వేస్తారు. వాడు సంబరపడతాడు.

చిన్న: జంబు, పాండవులు అస్మదీయులు. మరి వాళ్ళ విరోధులను ఏమనాలి?

జంబు: తసమదీయులు– తసమదీయులు.

చిన్న: ఓరి నీ తెలివీ నువ్వూ. అస్మదీయులకి విరుగుడు తస్మదీయులని వీడు పుట్టించాడు ప్రభూ.

ఘటో: ఔనౌను. ఎవరూ పుట్టించకుండా మాటలెలా పుదతాయి? వెయ్యి వీడికి –రెండు(వేళ్ళు చూపిస్తాడు).

చిన్న:ఆశ్చర్యంగా– రెండా?ఊఁ. వెయ్!(జంబు గొప్పపడుతుంటే దుంబు మొహం మాడ్చుకుంటాడు)

ఘటో:చిన్నమయా. మరి ఆ దుర్యోధన, దుశ్శాసన, కర్ణ శకునులు– ఆ నలుగుర్నీ కలిపికొట్టినట్లు ఏమంటారో చెప్పెయ్!

చిన్న: ఓ! దుష్టచతుష్టయం...అనండి.

దుంబు,జంబు: ఓ– దు– (నోరు తిరగదు)

చిన్న: ఊఁ. పరవాలేదు. అనండి. దుష్టచతుష్టయం.

జంబు: దుషట చతుషటయం.

దుంబు: దుషట చతుషటయటటః.

చిన్న: అబ్బా. శివశివా శివశివా.

దుంబు,జంబూ: అబ్బా. శివశివా శివశివా.

చిన్న: ఉష్.

దుంబు,జంబూ: ఉష్,

చిన్న: అలా విడివిడిగా అంటే దోషం.

ఘటో: దోషమేమిటి దోషం? ఆ దుష్టచతుష్టయాన్ని అలాగే విడదీసి, చీల్చి విడదీసి, విడివిడిగా పొడిపొడి చేసెయ్యాలి. అహ్హాహ్హా. దుషట చతుషటయం.(వినోదిస్తాడు.)

–హా నాయకా.(బాణం దెబ్బతిన్న రాక్షసుడు ఎదుట నిలుస్తాడు) ఎవడో నరుడు. నన్ను పొడిపొడి చేశాడు. చిన్న కుర్రవాడు.

ఘటో: ఆఁ. నరుడా! కుర్రవాడా! ఆశ్చర్యం. ఆశ్చర్యం.! హాయ్ లంబు .హాయ్ జంబు. ఇక సహించను. మీ మాయల్నిపన్ని వాణ్ణి భస్మం చేసి రండి.

లంబు, జంబు.; వాణ్ణి మసిచేసి నుసిచేసి పట్టుకొస్తాం నాయకా.

ఘటో; ఆగండి. ఆ బాలుణ్ణి చూడముచ్చటగావుంది. ప్రాణాలతో పట్టి తెండి. (చిన్నమయ ఆ ఆలోచనని ఆమోదించి తల ఊపుతాడు) ఊఁ. పొండి.——వాళ్ళు రెండడుగులు వెనక్కివేసి మాయమౌతారు.

లంబు,జంబు మాయలుపన్ని కార్చిచ్చు సృష్టిస్తారు. అభిమన్యుని రథం మంటల్లో చిక్కుకోగా గుర్రాలు బెదురుతాయి. ( ఈ సీను చిత్రీకరణ అత్యంత విస్మయం కలిగిస్తుంది. )

సారథి దారుకుడు: ఏమిటిది? వీరకుమారా?

అభి: ఇదిగో వాయవ్యాస్త్రం.——ప్రయోగించి ప్రచండమైన గాలితో మాయలు పటాపంచలుచేసి మంటలు చెదరగొడతాడు. కార్చిచ్చు మటుమాయమౌతుంది. నేపథ్యంలో వికటాట్టహాసాలు. అభిమన్యుడు మరొక శరం ప్రయోగిస్తాడు. ఘటోత్కచుడు ఎదుటనిలిచి ఆ బాణాన్ని పట్టుకుంటాడు,. అతడు మెట్టపై దిగిన చోట బండ విరిగి కిందపడటం కూడా సహజంగా చిత్రీకరించారు. డైరెక్షన్ ప్రతిభ.

ఘటో: మెచ్చినానురా. నన్నే కదిలించిన నీవు, నీ వీరము. నేత్రోత్సవంగా ఉన్నావు.

అభి: ఓహో . ఇప్పటికైనా ధైర్యంచేసి నా ఎదుట నిలిచావు. నాకూ పరమోత్సాహంగా వుంది...రా!

ఘటో: వైవై బాలకా. నీ రూపం,కోపం ముద్దుగొలుపుతున్నాయి. నాతో యుద్ధానికి నీవు చాలవురా –పేరుచెప్పి శరణుకోరరా. నావాడవౌతావ్.

అభి: హుఁ. శరణుకోరమని బ్రతిమాలే నీవూ ఒక వీరుడవేనా? నీ చేతనే శరణనిపిస్తాను. చూడు.(శరం వేస్తాడు)

ఘటో: ఆఁ. ఎంతదెబ్బ కొట్టినావురా. (కారుణ్యంతో) కాని తిప్పికొట్టడానికేలనో చేతులు రావటంలేదురా బాలకా.

అభి: చేతులురాక కాదు. చేతకాక–అనిచెప్పు. లేని పెద్దరికం పైన వేసుకుని నన్ను బాలకా అనగానే సరిపోదు. చూపించు నీ ప్రతాపం.

ఘటో: నీవెంత కవ్వించినా కనికరమే కలుగురతుందిగాని కసిరేగటం లేదురా బాలకా. మాతా– ఈ ఔద్ధత్యం కూడదని బుద్ధిచెప్పి పేరైనా చెప్పించి నీ కుమారుని దక్కించుకో.

దారుకుడు: కుమారా. పోనీ పేరైనా చెప్పండి.

అభి: అసంభవం. విరోధికి భయపడి పేరు చెప్పడమా? ఓరీ అసురాధమా. నీవు నన్ను జయించలేక ఈ నీచోపాయానికి దిగావు. నీవు టక్కరివి. పిరికిపందవు. నీకు పౌరుషం లేదు.

ఘటో:: ఏమిరా నీ ఆర్భాటం. నా బలపరీక్షకే దాపురించినట్లు నన్నే ధిక్కరిస్తావ్? కాసుకో(అని గద తీసేలోపల బాణం వచ్చి కొట్టేస్తుంది. ఆశ్చర్యంతో వికటాట్టహాసం చేస్తూ మాయమౌతాడు. యుద్ధాన్ని తిలకిస్తున్న లంబు జంబుల ప్రక్కనే చెట్టుకి బాణం వచ్చి గుచ్చుకుంటుంది. వాళ్ళు భయంతో వణికిపోతారు. అదృశ్యంగా

వికటాట్టహాసం వినిపించగా సుభద్ర ముఖంలో ఆందోళన. అభిమన్యుడు రథం దిగుతాడు. సుభద్ర, దారుకుడుకూడా రథం దిగుతారు. అభిమన్యుడు ముందుకుపోయి నిలుస్తాడు. వివిధ అస్త్రశస్త్రాల ప్రయోగంతో ఘోరంగా భీకరమైన యుద్ధం. ఆకాశంలో అస్త్రాల ఆకారాలు, విన్యాసాలు, పరస్పరం ఢీకొనటం తెరపై మొట్టమొదటిసారిగా అత్యద్భుతంగా చిత్రీకరించారు. ఈ సీను కోసమే ప్రేక్షకులు విరగబడి చూసేవారు. చివరిగా ఘటోత్కచుడు గదపై ఆగ్నేయాస్త్రం ప్రయోగిస్తాడు.

అభిమన్యుని వారుణాస్త్రం మంటలను చల్లార్చినా వేడిగా సెగలుకక్కే గద అభిమన్యుని నుదుటికి తగిలి అతడు నేలకొరుగుతాడు. )

సుభద్ర: అభిమన్యు. అభిమన్యు ..నాయనా.

దారు: అది కేవలం మూర్ఛతల్లీ. తెలివి వచ్చేలోగా అసురుడు విజృంభించకుండా చూడాలి.——వీరనారి సుభద్ర విల్లమ్ములు చేకొంటుంది.

పద్యం

అఖిల రాక్షస మంత్రతంత్రాదిచయము

నణచు శ్రీకృష్ణు సోదరినగుదునేని

(ఘటోత్కచుడు విస్మయంతో వద్దువద్దని అభినయిస్తాడు)

దివ్యశస్త్రాస్త్రమహిమల తేజరిల్లు

అనఘు అర్జునుపత్నినేనగుదునేని

ఈ శరంబసురుగూల్చి సిద్ధించుగాక

పాండవకులైకభూషణు ప్రాణరక్ష!!!

ఘటోత్కచుడు ఆమె ముందు నిలచి నమస్కరిస్తూ——శరణు మాతా శరణు.శరణు.

క్షమించు మాతా. తెలియకచేసిన అపరాధమిది. నేను భీమసేనమహారాజువారి పుత్రుడను. ఘటోత్కచుడను.ఔను మాతా. తెలియకచేసిన అపరాధమిది.

అభిమన్యుడు లేచి——ఓరీ అసురాధమా. ఇక నీవెక్కడున్నా సరే...

ఘటో: ఆఁ ఆఁ. విజయోస్తు సోదరా. విజయోస్తు. నేనిక్కడనే వున్నాను. మాతరక్షణలో.

సుభద్ర: నాయనా అభిమన్యూ. నీ అగ్రజుడు ఘటోత్కచుడు.

అభి: హైవై అగ్రజా.

ఘటో: వైవై అనుజా.(ఇద్దరూ కౌగలించుకుంటారు.) లంబు,జంబు ఆనందిస్తారు. దారుకుడు ఆశీర్వదించి రథం వెనుకకు మళ్ళిస్తాడు.

ఘటో: ఆనందం మాతా. పరమానందం. రాకరాక వచ్చారు. దొరక్కదొరక్క దొరికారు. ఇక మిమ్మల్ని విడిచిపెట్టను. (రోషం వచ్చినా పట్టలేదు. హర్షం వచ్చినా పట్టలేదు.)

హిడింబ: సుపుత్రా సుపుత్రా! నీకిది తగదంటిని కదరా. ఏమిఁటీ గందరగోళం? ఎవరీ నరులు? వీళ్ళని ఎందుకిలా నిర్బంధిస్తున్నావు?

ఘటో: నిర్బంధం కాదు మాతా. ఆతిథ్యం. ఈమాత ఎవరనుకున్నవ్? అర్జున ఫల్గుణ పార్థ కిరీటి బీభత్స బాబాయిగారి పట్టపు రాణి.

సుభద్ర హిడింబకి నమస్కరించి: అక్కా హిడింబా.

హిడింబ: అలమలం చెల్లీ. అలమలం. ఎన్నాళ్ళకు చూశాను? ఎన్నాళ్ళకు చూశాను? వీడు నీ సుపుత్రుడా?

అభి: ఔను మాతా ఔను.——నమస్కరిస్తాడు.

హిడింబ: అలమలం సుపుత్రా. అలమలం.

ఘటో: అలమలం. హై లంబు, హై జంబు. అస్మదీయులురా. అస్మదీయులు. ఆఁ. మొక్కండి మొక్కండి.(వాళ్ళు సుభద్ర అభిమన్యులకు మొక్కుతారు,)

దారు: అమ్మా సుభద్రా దేవీ. శలవు.

ఘటో; ఆఁఆఁ శలవు. హై లంబు,హై జంబు.అస్మదీయులకు అఖండ గౌరవం చెయ్యాలి. వాద్యాలు, గీతాలు. పరమోత్సవం చెయ్యాలి. ఆఁ పదండి. పదండి. మాతా సోదరా– ఆప్యాయంగా సాదరంగా వారిని ఆహ్వానిస్తాడు. (కథలో పెద్ద మలుపు)

# INTERVAL విరామం

దుర్యోధనుని సమావేశ మందిరంలో దుష్టచతుష్టయం——

శకుని: పెద్దలు పెద్దలు పెద్దలు. పెళ్ళికిపోతూ పిల్లిని చంకనపెట్టుకుని వెళ్ళినట్లు! మనతొ వీళ్ళంతా ఎందుకు?

దుశ్శాసనుడు: అసలా ద్రోణుడు,కృపుడు,అశ్వత్థామ మన బంధువులైనాకారు? వాళ్ళ పేర్లు ముందే కొట్టేశానన్నా.

దుర్యో: మరి భీష్మ విదురులు మన వంశ వృద్ధులు. వంశ కర్తలు. వాళ్ళు రాలేదేమని శ్రీకృష్ణుడైనా అడిగిస్తాడు. ఏమని సమాధానం చెప్తావు మామా?

శ: ఆఁ. ఏమని చెప్పాలి? ఇప్పటికీ వాళ్ళకా పాండవ పక్షపాతం పోలేదు.

కర్ణుడు: పక్షవాతం వచ్చిందనో, వృద్ధులు కదలలేరనో చెప్పేస్తాం.

దుశ్శా: భలే కర్ణా భలే. ఈ వృద్ధుల్నికూడా కొట్టేశాను.

దుర్యో: ఇలా అందరినీ కొట్టివేసి మనం నలుగురమే పెళ్ళికి తరలి వెళ్తే ఏమి శోభస్కరంగా వుంటుంది?(కాస్త వివేకం పొడచూపి)

శ: నలుగురేమిటి దుర్యోధనా? నీవు, నీవెంట నీ విధేయులు నూర్గురు సోదరులు వుంటే చాలు. శోభస్కరంగానూ వుంటుంది. అక్కడ మనకి మాటా దక్కుతుంది. దుశ్శా: భలే మామా భలే. ఇక మన తక్షణ కర్తవ్యం?

శ: ప్రయాణసన్నాహం.

శాస్త్రి,శర్మ: విజయోస్తు ప్రభూ. శ్రీశ్రీ తాతపాదులవారు త్వరపడి శ్రీశ్రీ లక్ష్మణకుమారులవద్దకు వేంచేయాలి.

దుశ్శా: అక్కడ మనవాడు ఏం తక్షణ సమస్య తెచ్చిపెట్టాడో? (సున్నపు పిడత వాటం!) వెళ్ళు మామా వెళ్ళు.

శ: ఎందుకు? మన చిరంజీవే వచ్చాడు! – (ఎవరినో ఉద్ధరిస్తున్నట్లు మొహం గంటుపెట్టుకుని లక్ష్మణకుమారుడు ప్రవేశం.)

శ: యువకుల లక్షణం! పెళ్ళికుమారుని చెయ్యగానే ఇలా నలుగుర్లోకీ రావాలని అనిపిస్తుంది. (కొసవెర్రిచేష్టకి సమర్థన) – దుర్యోధనుని మొహం వికసిస్తుంది.(ఎంతైనా పుత్ర ప్రేమ కదా!)

లక్ష్మణకుమారుడు: ఔను తాతగారూ. నేను సభాపిరికినికాను. నలుగురిలోనూ చెప్పగలను కాబట్టే వచ్చాను. నేనిప్పుడు పెళ్ళి చేసుకోను.

దుర్యోధనుడు– హతాశుడై:ఆఁ?

ల.కు: ఔను నాన్నగారూ. ముందు పెళ్ళికూతుర్ని చూసి వరించందే పెళ్ళి చేసుకోవడం వీరోచితం కాదు.

శ: ఆఁ. నేననుకుంటూనేవున్నాను దుర్యోధనా. మనమీది గౌరవంతో మనవాడు అప్పుడు మరిచిపోయినాడు. (సమయస్ఫూర్తితో మాటలు అందించడం).

ల.కు: ఔను. ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది.

శ: ఔను నాయనా. నీవంటి వీరుడు ఎక్కడ ఏ పిల్లవున్నా వెళ్ళి చూడవలసిందే. అందంగా కనిపిస్తే హరిహరాదులు అడ్డం వచ్చినా హరించి తీరవలసిందే!

ల.కు: అదే మరి.

శ: అందుకు అభిమన్యుడైతే జంకుతాదడేమోగాని నీకేం భయం? (మిత్రభేదం. లేనిపోని ప్రతాపాలు అంటగట్టి అందలం ఎక్కించడం) మనం ఇప్పుడే ద్వారకకి తరలివెళదాం. విడిది ఇంట్లో చేరగానే పెళ్ళికూతుర్ని పిలిపిస్తాను. చూద్దువుగాని. (లోకంలో లేని ఆచారం) నీకు నచ్చుతుందనే నా ఉద్దేశ్యం.

ల.కు: నచ్చకపోయినాసరే. పెళ్ళికూతురుని నేను చూసి తీరాలి. అది నా ప్రతిజ్ఞ.

శ: అహ్హహ్హ. అలాగే నాయనా. మరి ప్రయాణానికి సిద్ధపడు.

ల.కు: ప్రయాణానికి నేనెప్పుడూ సిద్ధమే.(వెనుదిరిగి వెడతాడు) –శకుని తలపంకించి అప్రయోజకుడైన లక్ష్మణకుమారుని తిక్క తత్త్వం తెలిసిన వాడిగా నిట్టూరుస్తాడు.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments